శనివారం 01-6-2024

# ముందడుగు దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 351, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD



మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616

email: mundadugu111@gmail.com


# దేశంలో 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

## ఎండల కారణంగా ఇప్పటికి 54 మంది మృతి ▪ అత్యధికంగా బీహార్‌లో 32 మంది మృతి

**ముందడుగు జాతీయం:**

దేశాన్ని ఎండలు వణికిస్తున్నాయి. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో 45 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ క్రమంలో.. ఢిల్లీతో సహా పలు చోట్ల మధ్య, తూర్పు మరియు ఉత్తర భారత దేశంలో తీవ్రమైన వేడిగాలులు వీస్తున్నాయి. ఎండల కారణంగా ఇప్పటివరకు 54 మంది మృతి చెందారు. మే 31 నుంచి జూన్ 1 వరకు ఉత్తరప్రదేశ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీలో తీవ్ర వడగాల్పులు వీస్తాయని అంచనా వేశారు. భారత వాతావరణ శాఖ ప్రకారం.. మే 31 నుంచి జూన్ 2 మధ్య వాయువ్య భారతదేశంలోని మైదానాలలో ఉరుములు మరియు మెరుపులతో కూడిన అతి తక్కువ/తేలికపాటి వర్షపాతం నమోదవుతుందని అంచనా వేశారు. గురువారం.. ఢిల్లీలో గరిష్ట ఉష్ణోగ్రత 45.6 డిగ్రీల సెల్సియస్, సాధారణం కంటే 5.2 డిగ్రీలు ఎక్కువగా నమోదైంది.

తీవ్రమైన వడగాలుల కారణంగా బీహార్‌లో 32 మంది వడదెబ్బతో మరణించారు. అందులో ఔరంగాబాద్‌కు చెందిన 17 మంది, అర్రాలో ఆరుగురు, గయాలో ఒక్కరు, రోహతాస్‌లో ముగ్గురు, బక్సర్‌లో ఇద్దరు, పాట్నాలో ఒకరు మృతిచెందారు. అటు.. ఒడిశాలోని రూర్కెలాలో 10 మంది చనిపోయారు. జార్ఖండ్‌లోని పాలము, రాజస్థాన్‌లలో ఐదుగురు మరణించగా, ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్‌లో ఒకరు మరణించారు. గురువారం.. రాజస్థాన్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్, ఒడిశా, తూర్పు మధ్యప్రదేశ్ మరియు విదర్భలోని అనేక ప్రాంతాలలో గరిష్ట ఉష్ణోగ్రతలు 45 నుంచి 48 డిగ్రీల సెల్సియస్‌లో నమోదైందని వాతావరణ శాఖ తెలిపింది.





## వడదెబ్బతో ఆరుగురు జవాన్లు మృతి

వివరాలు 3లో



## ఎయిర్ హోస్టెస్ ప్రైవేట్ భాగాల్లో కిలో బంగారం

వివరాలు 3లో



## ఇప్పుడు ఇదో ట్రెండ్.. ప్యాంట్‌లెస్ ట్రెండ్

వివరాలు 4లో

# జూన్ 2న జైలుకు నేను రెడీ..

- 3 గంటలకు ఇంటి నుంచి బయలుదేరుతాను
- ఢిల్లీ ప్రజల సంక్షేమమే తన ధ్యేయం
- ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యలు

**ముందడుగు ఢిల్లీ:**

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ జూన్ 2న లొంగిపోయేందుకు సిద్ధమయ్యారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు కేజ్రీవాల్‌కి జూన్ 1 వరకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఆ తర్వాత లొంగిపోవాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం మిగతా 2లో



# భారత్‌కు వచ్చిన లక్ష కిలోల బంగారం

- ఇంగ్లాండ్ నుంచి భారీ ఎత్తున తరలింపు
- గతంలో బంగారాన్ని తాకట్టు పెట్టిన ఇంగ్లాండ్

**ముందడుగు జాతీయం:**

గతంలో ఆర్థిక సంక్షోభం కారణంగా భారత్ పెద్దఎత్తున ఇంగ్లాండ్ వద్ద పసిడి నిల్వలను తనఖా పెట్టాల్సివచ్చింది. ఇప్పుడు ఇంగ్లాండ్ నుంచి భారీఎత్తున బంగారం నిల్వలను ఆర్‌బీఐ భారత్‌కు తరలించింది. దాదాపు 100 టన్నులు అంటే లక్ష కిలోల పసిడిని దేశీయ ఖజానాలో చేర్చింది. 1991 తర్వాత ఈ స్థాయిలో బంగారాన్ని తరలించడం ఇదే తొలిసారి. రవాణా, నిల్వ సర్దుబాట్లలో భాగంగానే భారత్ ఇంతమొత్తం బంగారాన్ని తీసుకొచ్చింది. దేశీయంగా ముంబయి మింట్ రోడ్డు సహా నాగ్‌పుర్‌లోని పాత కార్యాలయాల్లో ఆర్‌బీఐ పుత్తడిని నిల్వ చేస్తుంటుంది. కొన్నేళ్లుగా కేంద్ర బ్యాంకు పెద్దఎత్తున బంగారాన్ని కొనుగోలు చేస్తూ వస్తోంది. దీన్ని ఎక్కడ నిల్వ చేయాలనేది మిగతా 2లో




## భోజనం పెట్టలేదని భార్యను నరికిన భర్త

02

## చెన్నైలో తల్లిపాల వ్యాపారం బట్టబయలు

02

ముందడుగు
శనివారం, 01-6-2024, హైదరాబాద్

# జూన్ 2న జైలుకు నేను రెడీ..

మొదటిపేజీ తరువాయి

కేజ్రీవాల్ మాట్లాడుతూ.. ''ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు నా ఇంటి నుంచి బయలుదేరుతాను. మేము నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాము, మరియు నేను దేశం కోసం నా జీవితాన్ని త్యాగం చేయాల్సి వస్తే, చింతించొద్దు'' అని కేజ్రీవాల్ శుక్రవారం విలేకరులు సమావేశంలో అన్నారు. 50 రోజుల జైలు శిక్షలో తన ఆరోగ్యం గణనీయంగా క్షీణించిందని, ఫలితంగా బరువు తగ్గడంతో పాటు మరికొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, డయాబెటిస్‌కి మందులు ఇవ్వకుండా తిరస్కరించారని ఆయన అన్నారు. తన ఆరోగ్యంపై వైద్యులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా ఢిల్లీ ప్రజల సంక్షేమమే తన ధ్యేయమని చెప్పారు. ఉచిత విద్యుత్, మొహల్లా క్లినిక్‌లు, ఆస్పత్రులు, ఉచిత మందులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సేవలు, కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని ఆయన హామీ ఇచ్చారు. ''నేను మీ మధ్య ఉండనప్పటికీ, చింతించొద్దని, అన్ని పనులు జరుగాయి'' అని కేజ్రీవాల్ అన్నారు. తాను భౌతికంగా మీ మధ్య లేకున్నప్పటికీ, ఏ సంక్షేమ కార్యక్రమం కూడా ఆగదని చెప్పారు. వృద్ధులైన తన తల్లిదండ్రుల శ్రేయస్సు కోసం ప్రార్థించాలని ప్రజలను కోరారు.

# ప్రజ్వల్‌ను అరెస్టు చేసిన మహిళ పోలీసులు

## మహిళ పోలీసుల జీపులోనే తరలింపు ■ ఇద్దరు మహిళా ఐపీఎస్ అధికారిణుల నేతృత్వం

**ముందడుగు కర్ణాటక:**

జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ అనేక మంది మహిళలపై లైంగిక దౌర్జన్యానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సిట్ అధికారులు అరెస్టు చేశారు. కానీ ఆయనను అదుపులోకి తీసుకునేందుకు మహిళా పోలీసు బృందమే ఎయిర్‌పోర్టుకు వెళ్లింది. ఇద్దరు మహిళా ఐపీఎస్ అధికారిణులు దీనికి నేతృత్వం వహించారు.

జర్మనీ నుంచి బెంగళూరు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ప్రజ్వల్‌కు మహిళా పోలీసులు దర్శనమిచ్చారు. అనంతరం ఆయన్ను చుట్టుముట్టారు. అరెస్టు వారెంటు చూపించి అదుపులోకి తీసుకున్నారు. అక్కడినుంచి సీఐడీ కార్యాలయానికి తరలించే క్రమంలోనూ.. ఆ జీపులో మహిళా పోలీసు అధికారిణులే ఉన్నారు. ఐపీఎస్‌లు సుమన్ డీ పెన్నేకర్, సీమా లాట్కర్‌ల నేతృత్వంలో అరెస్టు జరిగింది.

''ప్రజ్వల్‌ను అరెస్టు చేయడానికి మహిళా పోలీసు అధికారులనే పంపాలని నిర్ణయించాం. ఎంపీ పదవిని, పలుకుబడిని అడ్డంపెట్టుకొని మహిళలపై బెదిరింపులకు పాల్పడ్డాడు. ఆయన్ను అరెస్టు చేసే



అధికారం కూడా ఆ మహిళలకే ఉందనే సందేశాన్ని ఇవ్వాలని అనుకున్నాం'' అని సిట్ అధికారులు వెల్లడించారు. అంతేకాకుండా మహిళా అధికారులు ఎవరికీ భయపడరనే సందేశాన్నీ బాధిత మహిళలకు ఇవ్వడం ద్వారా వారికి భరోసా కలిగించడమే తమ ఉద్దేశం అన్నారు.

# భారత్‌కు వచ్చిన లక్ష కిలోల బంగారం

మొదటిపేజీ తరువాయి

ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ క్రమంలో విదేశాల్లోని మన నిల్వలు గణనీయంగా పెరిగాయి. దీంతో కొంత మొత్తాన్ని భారత్‌కు తీసుకురావాలని నిర్ణయించింది. చాలా దేశాల కేంద్ర బ్యాంకులు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో తమ బంగారాన్ని నిల్వ చేస్తుంటాయి. అదే బాటలో భారత్ సైతం అక్కడి డిపాజిటరీల్లో పెద్దఎత్తున పసిడిని నిల్వ చేస్తూ వచ్చింది. 2024 మార్చి ముగిసేనాటికి ఆర్‌బీఐ వద్ద 822.1 టన్నుల బంగారం ఉంది. దీంట్లో 413.8 టన్నులు ఇతర దేశాల్లో నిల్వ చేసి ఉంచింది. ఇటీవల కొన్నేళ్లుగా వరుసగా




కొనుగోలు చేస్తూ వచ్చిన కేంద్ర బ్యాంకు గత ఏడాది 27.5 టన్నుల పసిడిని కొత్తగా నిల్వల్లో చేర్చింది. ఈ ఏడాది కొనుగోళ్ల జోరు మరింత పెరిగింది. జనవరి ఏప్రిల్ వ్యవధిలోనే 2023 మొత్తం కంటే ఒకటిన్నర రెట్లు అధిక బంగారం కొనుగోలు చేయడం గమనార్హం.

# భోజనం పెట్టలేదని భార్యను నరికిన భర్త

- **చర్మం కోసి మృతదేహాన్ని ముక్కలుగా నరికాడు**
- **కర్ణాటకలోని తుమకూరు జిల్లాలో దారుణం**




**ముందడుగు కర్ణాటక:**

ఒక వ్యక్తి కిరాతకంగా ప్రవర్తించాడు. భోజనం పెట్టేందుకు నిరాకరించిందని భార్య తల నరికి చంపాడు భర్త. ఆపై చర్మం కోసి మృతదేహాన్ని ముక్కలుగా నరికాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు షాక్ అయ్యారు. కర్ణాటకలోని తుమకూరు జిల్లాలో ఈ దారుణం జరిగింది. హులియూరుదుర్గ గ్రామంలోని అద్దె ఇంట్లో నివసిస్తున్న శివరామ్‌కు పదేళ్ల కిందట పుష్పతో పెళ్లైంది. అతడు రంపం మిల్లులో పని చేయడంపై భార్యాభర్తల మధ్య తరుచుగా గొడవలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి శివరామ్ మిల్లు నుంచి ఇంటికి తిరిగి వచ్చాడు. అయితే అతడి ఉద్యోగం విషయంపై భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. గొడవ తీవ్రం కావడంతో భర్తకు భోజనం పెట్టేందుకు భార్య పుష్ప నిరాకరించింది. ఆగ్రహించిన శివరామ్ కత్తితో పొడిచి 35 ఏళ్ల భార్యను హత్య చేశాడు. ఆ తర్వాత ఆమె తల నరికాడు. రాత్రంతా చర్మాన్ని తొలగించి మృతదేహాన్ని ముక్కలుగా నరికాడు. మరోవైపు శివరామ్ మంగళవారం ఉదయం తన భార్యను చంపిన విషయాన్ని ఇంటి యజమానికి చెప్పాడు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. వంట గదిలో బీభత్సంగా ఉన్న పుష్ప మృతదేహాన్ని గుర్తించారు. పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శివరామ్‌ను అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ దంపతుల ఎనిమిదేళ్ల కుమారుడు ఇంట్లో నిద్రపోతుండటాన్ని పోలీసులు గమనించారు.

# చెన్నైలో తల్లిపాల వ్యాపారం బట్టబయలు

- **200 మిల్లీ లీటర్లకు వెయ్యి రూపాయలు**
- **నలుగుర్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**ముందడుగు తమిళనాడు:**

చెన్నైలో తల్లిపాల వ్యాపారం బట్టబయలైంది. డబ్బాల్లో తల్లిపాలను భద్రపరిచి.. 200 మిల్లీ లీటర్లకు వెయ్యి రూపాయలకు విక్రయిస్తున్నట్లుగా అధికారులు గుర్తించారు. ఈ దందా చేస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. తల్లిపాల వ్యాపారంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిషేధం ఉన్నప్పటికీ.. కొంతమంది అక్రమంగా ఈ దందాను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో స్థానికులు ఫిర్యాదు చేయడంతో అప్రమత్తమైన ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. చెన్నై మహానగరంలోని మాధవరంలో ముత్తయ్యకు చెందిన ఓ వ్యాక్సిన్ స్టోర్‌పై దాడి చేసిన ఉన్నతాధికారులు తల్లి





పాలను విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. ప్రోటీన్ పౌడర్ విక్రయానికి లైసెన్స్ తీసుకుని ఆ ముసుగులో తల్లిపాలను విక్రయిస్తున్నట్లు తెలుసుకున్నారు. 50 బాటిళ్ల తల్లి పాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆ బాటిళ్లను గిండీలోని కింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ అండ్ రీసెర్చ్‌కు పంపించారు. ముత్తయ్య తల్లిపాలను ఎలా సేకరించాడు? ఎన్ని రోజుల నుంచి ఈ వ్యాపారం చేస్తున్నారనే దానిపై అధికారులు దృష్టి సారించారు. ఈ క్రమంలోనే తల్లి పాలను దానం చేసే మహిళల పేర్లు, ఫోన్ నంబర్లతో కూడిన ఓ బుక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ నోట్‌బుక్‌లో ఉన్న నంబర్లకు ఫోన్ చేసి కూడా వివరాలు తెలుసుకుంటున్నట్లు సమాచారం.

ముందడుగు
శనివారం, 01-6-2024, హైదరాబాద్

# వడదెబ్బతో ఆరుగురు జవాన్లు మృతి

**మరో ఇద్దరి జవాన్ల పరిస్థితి విషమం ■ ఉత్తరప్రదేశ్ మిర్జాపూర్‌లో ఘటన**



**ముందడుగు ఉత్తరప్రదేశ్:**

దేశవ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. అన్ని రాష్ట్రాల్లో 45 నుంచి 50 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.దాంతో ప్రజలు వేసవితాపాన్ని తాళలేక తల్లడిల్లిపోతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మిర్జాపూర్‌లో వడదెబ్బ తగిలి ఎన్నికల విధుల్లో ఉన్న ఆరుగురు జవాన్‌లు మరణించారు.

శుక్రవారం 23 మంది జవాన్‌లు వడదెబ్బతో మా ఆస్పత్రిలో చేరారని, వారిలో ఆరుగురు చికిత్స పొందుతూ మరణించారని, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని మిర్జాపూర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ ఆర్బీ లాల్ చెప్పారు. మరణించిన జవాన్‌లలో తీవ్ర జ్వరం, హై బీపీ లెవల్స్, హై షుగర్ లెవల్స్ ఉన్నాయని, అదే మరణానికి కారణమైందని అన్నారు.బీపీ, షుగర్ లెవల్స్ అధికంగా ఉంటే బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశం ఉందని ఆర్బీ లాల్ చెప్పారు.వడదెబ్బ తగిలిన జవాన్‌లు అందరూ ఇక్కడ ఎన్నికల్లో ఉన్నట్లు చెప్పారని, తమ దగ్గరికి రావడానికి ముందు వాళ్లు సొమ్మసిల్లి పడిపోయినట్లు తెలిపారని అన్నారు.

# ఏసీబీ వలలో కుషాయిగూడ సిఐ, ఎస్ఐ

**రూ.3లక్షలు లంచం తీసుకుంటుండగా దొరికిన వైనం**



**ముందడుగు క్రైం:**

హైదరాబాద్ నగరంలోని కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. భూ వివాదం కేసులో రూ.3లక్షలు లంచం తీసుకుంటుండగా.. ఇన్‌స్పెక్టర్ వీరస్వామి, ఎస్ఐ షఫీ, మధ్యవర్తి ఉపేందర్‌లను అనిశా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. దాదాపు రెండు గంటల నుంచి కుషాయిగూడ స్టేషన్‌లో ఏసీబీ సోదాలు కొనసాగుతున్నాయి. భూ వివాదం పరిష్కారం కోసం పోలీసు అధికారులు.. మధ్యవర్తిని ఏర్పాటు చేసుకుని అతని ద్వారా లంచం డిమాండ్ చేసినట్టు ఏసీబీ గుర్తించింది. గతంలో వీరిపై ఉన్న ఆరోపణలపై కూడా దృష్టి సారించారు. గుర్రంగూడ సమీపంలో ఉన్న ఇన్‌స్పెక్టర్ వీరస్వామి నివాసంలో కూడా ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్నారు.

# ఒడిశాలో ముగ్గురు వ్యక్తులకు ఆంత్రాక్స్

**అలెర్ట్ అయినా ఆరోగ్య అధికారులు**




**ముందడుగు ఒడిశా:**

ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలో ముగ్గురు వ్యక్తులకు ఆంత్రాక్స్ సోకింది. వైద్య పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో ఆరోగ్య అధికారులు అలెర్ట్ అయ్యారు. ప్రభుత్వ హాస్పిటల్‌లో అడ్మిట్ చేసి చికిత్స అందిస్తున్నారు. ముగ్గురు వ్యక్తులు ఆంత్రాక్స్ బారినపడినట్లు ఆరోగ్య శాఖ అధికారి తెలిపారు. మంగళవారం నుంచి గురువారం వరకు లక్ష్మీపూర్ బ్లాక్‌లో మూడు కేసులు నమోదయ్యాయని చెప్పారు. వైద్య పరీక్షల్లో ముగ్గురికి ఆంత్రాక్స్ ఇన్‌ఫెక్షన్ పాజిటివ్‌గా తేలిందని అన్నారు. వారిని హాస్పిటల్‌లో అడ్మిట్ చేసి చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. ఆంత్రాక్స్ సోకిన ఆవు కళేబరం నుంచి ముగ్గురు గ్రామస్తులకు అది సోకి ఉంటుందని అనుమానిస్తున్నట్లు కోరాపుట్ అదనపు జిల్లా వైద్యాధికారి సత్యసాయి స్వరూప్ తెలిపారు. ఆంత్రాక్స్ కేసులు నమోదైన కుటింగ గ్రామానికి ఆరోగ్య నిపుణుల బృందాన్ని పంపినట్లు చెప్పారు. ఆ గ్రామంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. ఆంత్రాక్స్ అనేది స్పోర్ ఫార్మింగ్ బాక్టీరియం బాసిల్లస్ ఆంత్రాసిస్ వల్ల కలిగే వ్యాధి అని వివరించారు.

# ఎయిర్ హోస్టెస్ ప్రైవేట్ భాగాల్లో కిలో బంగారం

- గుర్తించిన డీఆర్ఐ అధికారులు
- కేరళ కన్నూరు ఎయిర్‌పోర్టులో ఘటన



**ముందడుగు కేరళ:**

ఎయిర్ హోస్టెస్ తన ప్రైవేట్ భాగాల్లో దాదాపు కిలో బంగారం స్మగ్లింగ్ చేస్తున్నట్టుగా డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు గుర్తించారు. ఈ ఘటన కేరళలోని కన్నూరు ఎయిర్‌పోర్టులో చోటుచేసుకుంది. మూడు రోజుల క్రితం ఈ ఘటన చోటుచేసుకోగా తాజాగా వెలుగులోకి వచ్చింది.

మే 28న మస్కట్ నుంచి కేరళలోని కన్నూరుకు ఒక విమానం చేరుకుంది. అయితే ఆ విమానంలోని బంగారం స్మగ్లింగ్ జరుగుతుందని డీఆర్ఐ అధికారులకు సమాచారం వచ్చింది. డీఆర్ఐ కొచ్చిన్ ద్వారా అందిన నిర్దిష్ట సమాచారం ఆధారంగా కన్నూర్ డీఆర్ఐ అధికారులు మే 28న కన్నూర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మస్కట్ నుండి వచ్చిన ఓ విమానంలో తనిఖీ చేశారు. విమానంలో ఎయిర్‌హోస్టెస్‌గా ఉన్న కోల్‌కతాకు చెందిన సురభి ఖాతున్ అనే మహిళను అడ్డుకుని తనిఖీ చేశారు. ఈ క్రమంలోనే ఆమె మలద్వారంలో 960 గ్రాముల బంగారం గుర్తించారు. అనంతరం బంగారం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రూల్స్ ప్రకారం ఆమెపై విచారణ చేపట్టారు. అనంతరం సురభి ఖాతున్‌ను జురిస్డిక్షనల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. తరువాత కన్నూర్‌లోని మహిళా జైలులో 14రోజుల రిమాండ్‌కు పంపారు.



# ఉదయం బాధ్యతలు.. సాయంత్రం పదవీ విరమణ

- యూనిఫాంతో రిటైర్మెంట్ కావడం నాకల నెరవేరింది
- సీనియర్ పోలీస్ అధికారి ఏబీ వెంకటేశ్వర రావు

**ముందడుగు విజయవాడ:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సీనియర్ పోలీస్ అధికారి ఏబీ వెంకటేశ్వర రావుకు ఏపీ ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ప్రింటింగ్, స్టేషనరీ డీజీగా పదవిని అప్పగించింది. దీంతో విజయవాడలోని ప్రింటింగ్ ప్రెస్ కు చేరుకున్న వెంకటేశ్వరరావు డీజీగా బాధ్యతలు స్వీకరించారు. అయితే, ఉద్యోగుల బాధ్యతల్లో ఈరోజే ఆయనకు చివరి రోజు కావడంతో సాయంత్రం పదవీ విరమణ చేయనున్నారు.

ప్రింటింగ్ మరియు స్టేషనరీ డీజీగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఏబీ వెంకటేశ్వర్‌రావు మీడియాతో మాట్లాడారు. రెండు సంవత్సరాల తరువాత ఇదే ఆఫీస్ లో ఛార్జ్ తీసుకున్నా. నాకు అభినందనలు తెలిపేందుకు వచ్చిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు. ఈరోజు నా పదవీ విరమణ రోజు. ఈరోజే పోస్టింగ్ తీసుకున్నా. పోస్టింగ్ తీసుకున్నరోజు సాయంత్రమే పదవీ విరమణచేసే అవకాశం నాకు మాత్రమే వచ్చింది. కారణాలు ఏమైనా ఆల్ ఈజ్ వెల్ అని భావిస్తున్నానని ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నాను. ఎటువంటి వ్యాఖ్యలు చేయడం సరికాదు. పోస్టింగ్ ఆర్డర్లు వచ్చాయి. విధుల్లో చేరాను. ఇప్పటికి ఇంత వరకు మాత్రమే మాట్లాడాలి. ఇంతకాలం నాకు అండగా ఉండి ధైర్యం చెప్పిన మిత్రులు, శ్రేయోభిలాషులకు రుణపడి ఉంటా. నా కుటుంబ సభ్యులు, స్నేహితులకు ధన్యవాదాలు. యూనిఫాంతో రిటైర్మెంట్ కావడం నాకల నెరవేరినట్లుగా భావిస్తున్నట్లు చెప్పారు.

ముందడుగు
శనివారం,
01-6-2024,
హైదరాబాద్

# ఇప్పుడు ఇదో ట్రెండ్..
# ప్యాంట్‌లెస్ ట్రెండ్



## దీనివల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ▪ ఏఏ ప్రయోజనాలు ఉన్నాయో ఒకసారి తెలుసుకుందాం..

**ముందడుగు ప్రత్యేకం:**

టెక్నాలజీ పెరుగుతున్న కొద్ది కొత్త, కొత్త ట్రెండ్స్ మార్కెట్లోకి వస్తున్నాయి. సాధారణంగా ఎవరైనా ప్యాంటు వేసుకోవడం మరిచిపోతే ఎగతాళి చేస్తుంటారు. ఎక్స్‌పోజింగ్ ఎందుకు చేస్తున్నావని ప్రశ్నిస్తారు. ప్యాంటు లేకుండా తిరగడం అంటే చాలా మందికి సమాజ నియమాలు పాటించకపోవడం అనిపిస్తుంది. కానీ ఇది సరికాదు. ఎందుకంటే, అది ఒక పర్సనల్ ఛాయిస్. ఇష్టమైతే ప్యాంటు లేకుండా తిరగొచ్చు. దీన్ని ప్యాంట్‌లెస్ ట్రెండ్ అంటున్నారు. ప్యాంటు వేసుకోకుండా గడపడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని ప్రచారం చేస్తున్నారు. బిగుతుగా ఉండే, శరీరానికి అతుక్కుపోయే ప్యాంటు వేసుకోకుండా, వదులు దుస్తులు ధరిస్తే రిలాక్స్‌డ్‌గా ఉండవచ్చు. బీచ్‌లో లేదా వేసవిలో చల్లని గాలిని ఆస్వాదించవచ్చు. ఇలా చేస్తే శరీరం పరిసరాలతో మరింత సహజంగా, స్వేచ్ఛగా కనెక్ట్ అవుతుంది. అలాగే రక్త ప్రసరణ, పెల్విక్ హెల్త్ మెరుగుపడటం నుంచి ఆత్మ విశ్వాసం పెరగడం వరకు చాలా ప్రయోజనాలు లభిస్తాయి. ఇంకా దీనివల్ల ఏమేం బెనిఫిట్స్ ఉంటాయో చూద్దాం.



### రక్త ప్రసరణ

ప్యాంటు వేసుకోకపోతే శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. బిగుతైన బెల్టులు లేదా టైట్ డ్రెస్ ఉండదు కాళ్లకు, పొట్ట ప్రాంతానికి రక్త ప్రసరణ పెరుగుతుంది. దీనివల్ల వారికోస్ వెయిన్స్, ఎడీమా వంటి రక్త ప్రసరణ సంబంధిత సమస్యల ప్రమాదం తగ్గుతుంది. బ్లడ్ సర్క్యులేషన్ పెరిగితే సౌకర్యం, కదలిక సామర్థ్యం కూడా పెరుగుతుంది, ఫలితంగా మరింత స్వేచ్ఛగా కదలవచ్చు, తేలికగా ఫీల్ అవుతారు.

### కాన్ఫిడెన్స్, బాడీ పాజిటివిటీ

ప్యాంట్‌లెస్ లైఫ్‌స్టైల్ కారణంగా కాన్ఫిడెన్స్, బాడీ పాజిటివిటీ ఇంప్రూవ్ అవుతుంది. సెల్ఫ్‌యాక్సెప్టెన్స్ ఫీలింగ్ కలుగుతుంది. సమాజం అంచనాలు, బ్యూటీ స్టాండర్డ్స్ నుంచి విముక్తి పొందడం ద్వారా, బాడీ ఎలా ఉంటే అలానే ఇష్టపడటం స్టార్ట్ చేయవచ్చు. షేప్‌లు, సైజులు, బాడీ ఫీచర్స్ గురించి భయపడకుండా, చాలా కాన్ఫిడెంట్‌గా ఉండవచ్చు.

### పెల్విక్ హెల్త్

కొందరికి ప్యాంటు లేదా లోదుస్తులు గట్టిగా బిగించి ధరిస్తే అసౌకర్యం, చికాకు కలుగుతుంది. అదే ప్యాంటు తీసేస్తే, పెల్విక్ హెల్త్ ఇంప్రూవ్ అవుతుంది. పెల్విక్ ఏరియాలో గాలి తగలడానికి, స్వేచ్ఛగా ఉండటానికి అవకాశం ఇవ్వడం ద్వారా స్కిన్ ఇరిటేషన్, ఈస్ట్ ఇన్ఫెక్షన్లు వంటి చర్మ సంబంధిత సమస్యల ప్రమాదం తగ్గుతుంది. ఎక్కువ సేపు ఫ్రిక్షన్ కారణంగా చర్మం, తేమ పెరిగి ఈ సమస్యలు వస్తాయి.

### శరీర ఉష్ణోగ్రత

వేడి వాతావరణంలో లేదా సమ్మర్‌లో ప్యాంటు లేకుండా తిరగడం మంచిది. ఎందుకంటే ఇలా చేస్తే శరీర ఉష్ణోగ్రత సరిగ్గా ఉంటుంది, కింది శరీరం వేడెక్కదు. చెమటలు పట్టవు. పట్టిన చెమట త్వరగా ఆవిరైపోయి చల్లదనాన్ని, సౌకర్యాన్ని అందిస్తుంది. చల్లని వాతావరణంలో, స్కర్ట్స్ లేదా షార్ట్స్ వంటి బ్రీతబుల్ క్లాత్ ధరించడం వల్ల గాలి లోపలికి వెళ్లడానికి అవకాశముంటుంది.

### ప్రకృతితో కనెక్షన్

ప్యాంటు లేకుండా బయటకు రావడం ద్వారా ప్రకృతితో మంచి కనెక్షన్ ఏర్పడుతుంది, సూర్యరశ్మి, గాలి, భూమితో అటాచ్‌మెంట్ ఫీలింగ్ పెరుగుతుంది. బీచ్‌లో ఒట్టి కాళ్లతో నడవడం, మైదానంలో పాదాల కింద గడ్డిని అనుభూతి చెందడం లేదా చర్మంపై సూర్యరశ్మి వెచ్చదనాన్ని ఆస్వాదించవచ్చు.

### కదలిక సామర్థ్యం, స్వేచ్ఛ


ట్రౌజర్స్ వల్ల కొన్ని అడ్డంకులు ఏర్పడవచ్చు. ఇది ధరించకపోతే మన కదలిక సామర్థ్యం, స్వేచ్ఛ చాలా పెరుగుతాయి. యోగా, డ్యాన్స్ వంటి ఫిజికల్ యాక్టివిటీస్ సమయంలో స్వేచ్ఛగా, సౌకర్యవంతంగా కదలగలం, అడ్డంకులు లేని బట్టల వల్ల ఇబ్బంది పడకుండా ఉండగలం.

# చివరి దశ ఎన్నికల బరిలో మోడీ

## ఏడో విడతలో 57 నియోజకవర్గాలు ▪ వారణాసి నుంచి పోటీ చేస్తున్న నరేంద్ర మోడీ

**ముందడుగు జాతీయం:**

దేశంలో సార్వత్రిక ఎన్నికలు చివరి దశకు చేరుకున్నాయి. పోలింగ్‌లో భాగంగా ఏప్రిల్ 19వ తేదీన ప్రారంభమైన తొలిదశ పోలింగ్ జూన్ 1వ తేదీ వరకు సాగింది.ఇప్పటికే ఆరుదశల పోలింగ్ పూర్తవగా ఇక చివరిదైన ఏడవ దశ పోలింగ్ జూన్ 1వ తేదీ జరుగుతుంది. ఇందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను ఎన్నికల సంఘం పూర్తి చేసింది. ఇక చివరి విడత పోలింగ్‌లో మొత్తం 57 నియోజకవర్గాలున్నాయి. ఇవన్నీ ఎనిమిది రాష్ట్రాలు మరియు కేంద్రపా



లిత ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. ఉత్తర్ ప్రదేశ్, బీహార్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, ఒడిషా, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, చండీగఢ్ రాష్ట్రాల్లో పోలింగ్ జరుగుతుంది. ఈ సారి బరిలో 904 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. చివరి విడతలో ప్రధాని నరేంద్ర మోదీ పోటీ చేస్తున్న వారణాసి కూడా ఉంది. గోరఖ్‌పూర్ నుంచి రవికిషన్, మండి స్థానం నుంచి నటి కంగనా రనౌత్, హమీర్‌పూర్ స్థానం నుంచి కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్, పాటలిపుత్ర స్థానం నుంచి ఆర్జేడీ అధినేత లాలూ కుమార్తె మీసా భారతి,వెస్ట్ బెంగాల్ డైమండ్ హార్బర్ స్థానం నుంచి మమతా బెనర్జీ అల్లుడు అభిషేక్ బెనర్జీ, జలంధర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నేత పంజాబ్ మాజీ సీఎం చరణ్‌జీత్ సింగ్ చన్నీలు బరిలో ఉన్నారు.

# సినిమా థియేటర్లలో ఎన్నికల ఫలితాలు

## టికెట్ ధరలు రూ.99 నుంచి రూ.300 వరకు

**ముందడుగు జాతీయం:**

సార్వత్రిక ఎన్నికల సందడి ముగింపు దశకు చేరుకుంది. జూన్ 4 నాటి ఓట్ల లెక్కింపుపై ఉత్కంఠ మరింత పెరుగుతుంది. ఆ రోజున యావత్ దేశం టీవీలు, ఫోన్లకు అతుక్కుపోతుందంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. అదే ఎన్నికల ఫలితాలు బిగ్ స్క్రీన్‌పై కన్పిస్తే..! ఎలా అనుకుంటున్నారా..? మహారాష్ట్రలోని కొన్ని సినిమా థియేటర్లు ఈ ఫలితాలను ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు సిద్ధమయ్యాయి. ముంబయిలోని ఎస్ఎం5 కల్యాణ్,



సియాన్, కంజూర్‌మార్గ్‌లోని మూవీమ్యాక్స్ థియేటర్లు, థాణెలోని ఎటర్నిటీ మాల్, వండర్ మాల్, నాగ్‌పూర్‌లోని మూవీమ్యాక్స్ ఎటర్నిటీ, పుణెలోని మూవీమ్యాక్స్ తదితర థియేటర్లు జూన్ 4న ఎన్నికల ఫలితాలను పెద్ద స్క్రీన్‌పై ప్రసారం చేయనున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఇప్పటికే పేటీఎం వంటి వేదికల్లో బుకింగ్‌స్‌ను ప్రారంభించారట. ఆరు గంటల పాటు ఫలితాలను థియేటర్లలో లైవ్ స్ట్రీమ్ చేయనున్నారట. ఇందుకోసం టికెట్ ధరలు రూ.99 నుంచి మొదలుకొని రూ.300 వరకు ఉన్నాయి. ఇప్పటికే కొన్ని థియేటర్లలో ఫలితాల ప్రదర్శనకు హౌస్‌ఫుల్ అయినట్లు తెలుస్తోంది. టికెట్ బుకింగ్‌కు సంబంధించిన స్క్రీన్‌షాట్లను కొందరు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడంతో ప్రస్తుతం ఇవి వైరల్‌గా మారాయి.